# ప్రజాశక్తి

మంగళవారం 25 జూన్ 2024 | 5 | అనంతపురం







పార్లమెంట్‌లో ఎంపీలుగా ప్రమాణస్వీకారం చేస్తున్న అంబికా లక్ష్మినారాయణ, బికె.పార్థసారధి

## ఎంపీల ప్రమాణస్వీకారం

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన ఎంపీలు సోమవారం నాడు ఢిల్లీలోని పార్లమెంట్‌లో ప్రమాణస్వీకారం చేశారు. ఇందులో భాగంగా అనంతపురం, హిందూపురం పార్లమెంట్ స్థానాల నుంచి ఎన్నికైన అంబికా లక్ష్మినారాయణ, బికె.పార్థసారధిలు ప్రమాణస్వీకారం చేశారు. ప్రొటెం స్పీకర్ మెహతాబ్ వారి చేత ప్రమాణం చేయించారు. ఇద్దరు ఎంపీలు తెలుగులో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ప్రధాని, ప్రొటెం స్పీకర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్, పెనుకొండ**

# ఆ 'ఒక్క' దానిపైనే చర్చ..!



◆హిందూపురం 28వ పోలింగ్ స్టేషన్‌లో ఓటింగ్‌పై సందేహాలు ◆'అనంత'లో ఇప్పటికీ వెల్లడి కాని ఫారమ్-20

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

ఇప్పుడు ఎక్కడ చూసినా ఆ ఒక్క పోలింగ్ స్టేషన్‌లో వచ్చిన ఆ ఒక్క ఓటు గురించే సర్వత్రా చర్చ నడుస్తోంది. అదేమిటంటే హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గంలోని 28వ పోలింగ్ స్టేషన్ గురించి అన్ని చోట్లా చర్చ నడుస్తోంది. ఇది ఎలా సాధ్యమన్న సందేహాలు సర్వత్రా నెలకొన్నాయి. ఏమి జరిగిందోనని రాజకీయ విశ్లేషకులు సైతం తలలు పట్టుకుంటున్నారు. ఎందుకంటే మొన్నటి వరకు అధికారంలోనున్న వైసిపికి ఆ పోలింగ్ స్టేషన్ పరిధిలో పోలైన ఓట్లలో ఒకే ఒక్క ఓటు వైసిపి అభ్యర్థి దీపికకు పడింది. ఓటమి చెందవచ్చు... ఓట్లు తక్కువ రావొచ్చుగానీ మరీ పోలింగ్ స్టేషన్‌లో ఒక్క ఓటు రావటం ఏమిటన్న ప్రశ్నలు అందరి మదిలోనూ మొదలుతోంది. అదే వార్డులో పురపాలక సంఘం ఎన్నికల్లో వైసిపి పార్టీకి చెందిన వ్యక్తి కౌన్సిలర్‌గా గెలుపొందారు. అంతేకాకుండా ఆ పోలింగ్ స్టేషన్ పరిధిలో ఇద్దరు ఏజెంట్లు, వారి కుటుంబాలూ ఉన్నాయి. కాని ఒక్క ఓటే ఎలా వచ్చిందన్నది అంతుబట్టడం లేదని వైసిపి శ్రేణులు ప్రశ్నిస్తున్నారు. ఏదో మతలబు జరిగిందా అన్న సందేహాలూ వ్యక్తం చేస్తున్నారు.

**పోలైన 578 ఓట్లలో వైసికి వచ్చింది ఒక్క ఓటే..**

హిందూపురం పోలింగ్ స్టేషన్ నెంబరు 28 ముద్దలాపురం పరిధిలోకి వస్తుంది. ఇక్కడ చేనేతలు, ఇతరులు అధికంగా ఉన్నారు. ఈ పోలింగ్ స్టేషన్ పరిధిలో 578 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 570 ఓట్లు వాలిడ్‌కాగా, ఎనిమిది ఓట్లు నోటాకు పడ్డాయి. 570 ఓట్లలో కాంగ్రెసు అభ్యర్థి ఇనయతుల్లాకు 464 ఓట్లు అత్యధికంగా వచ్చాయి. నియోజకవర్గం అన్నింటిలో కంటే ఇనయతుల్లాకు ఎక్కువ ఓట్లు వచ్చింది ఇక్కడే. ఇకపోతే టిడిపి అభ్యర్థి నందమూరి బాలకృష్ణకు 95 ఓట్లు వచ్చాయి. ఇక వైసిపి అభ్యర్థి దీపికకు ఇక్కడ ఒకే ఒక్క ఓటు వచ్చింది. మిగిలిన ఓట్లు ఇతర అభ్యర్థులకు వచ్చాయి. తక్కిన ఇతర పోలింగ్ స్టేషన్లలో ఎక్కడా ఇంత తక్కువ ఓట్లు వైసిపికి రాలేదు. ఒకే ఒక్క ఓటు రావడం పట్లనే వైసిపి శ్రేణుల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**'అనంత'లో ఇప్పటికీ వెల్లడికాని ఫారమ్ 20**

అనంతపురం జిల్లాలో ఇప్పటికీ ఎన్నికల ఓట్లకు సంబంధించి బహిర్గత పరచాల్సిన ఫారమ్ 20 ఇప్పటికీ గోప్యంగానే ఉంది. సత్యసాయి జిల్లాలో వీటిని అందజేశారు. అనంతపురం జిల్లాలో మాత్రం ఇప్పటికీ ఫారమ్ 20ని బయటకివ్వకుండా గోప్యంగా ఉంచడం పట్ల కూడా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఫారమ్ 20 అంటే పోలింగ్ స్టేషన్ వారీగా ఏ అభ్యర్థికి ఎన్ని ఓట్లు వచ్చాయన్న వివరాలు పూర్తిగా ఉంటాయి. ప్రస్తుతం ఓట్ల లెక్కింపు రౌండ్ల వారీగా ఇచ్చారు. పోలింగ్ స్టేషన్ వారీగా ఇవ్వాల్సిన ఫలితాలు బయటకు రాలేదు. వివరాలు ఎందుకు వెల్లడించలేదన్న సందేహాలు అందరిలోనూ ఉండటం గమనార్హం.



ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్, అధికారులు

## ఫిర్యాదులకు సకాలంలో పరిష్కారం

◆'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు శ్రీకారం ◆కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

అనంతపురం కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమానికి సోమవారం శ్రీకారం చుట్టారు. కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ ఆధ్వర్యంలో వివిధ శాఖల జిల్లా అధికారులు ప్రజల నుంచి 410 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రశాంతంగా, శాంతియుతంగా ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. 24 గంటల్లో పరిష్కరించాల్సిన వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. జిల్లా అధికారులు ఈ ఆఫీస్‌లో నమోదు కాని వారు వెంటనే నమోదు కావాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ వికలాంగుల సమస్యలను వారి వద్దకే వెళ్లి వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియాదేవి, డిఆర్ఒ జి.రామకృష్ణారెడ్డి, సిపిఒ అశోక్ కుమార్ రెడ్డి, డిపిఒ ప్రభాకర్ రావుతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఎంఆర్‌సి కార్యాలయం ముందు నిలిచిన వర్షం నీరు

## ఎంఆర్‌సి ముందు నీటిమురుగు..!

**ప్రజాశక్తి-బొమ్మనహాల్**

బొమ్మనహాల్‌లో ఉన్న మండల రీసోర్స్ సెంటర్(ఎంఆర్‌సి)కి వెళ్లాలంటే నీటిలో అడుగు పడాల్సిందేనని స్థానికులు వాపోతున్నారు. మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి పాఠ్య, నోట్ పుస్తకాలు, విద్యార్థుల యూనిఫారం ఎంఆర్‌సిలో ఉంచారు. అయితే స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ క్రీడా మైదానం నుంచి వచ్చే వర్షం నీరంతా ఎంఆర్‌సి చుట్టూ చేరుతుంది. ఆ నీటికి మురుగు తోడవడంతో ఎంఆర్‌సికి వెళ్లే దారిలో నిత్యం నీరు నిల్వ ఉంటోంది. దీంతో కార్యాలయానికి వెళ్లాలన్నా, విద్యాసామగ్రి రవాణా వాహనాల్లోకి తరలించాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎంఆర్‌సి సమీపంలో ఓ చిన్న పాఠశాల ఉంది. వర్షం కురిస్తే ఆ మార్గంలో నీరు నిల్వ ఉండడంతో ఆ పాఠశాలకు సెలవు ప్రకటించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇకనైనా అధికారులు స్పందించి ఎంఆర్‌సి వెళ్లే మార్గంలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇదే విషయమై ఎంఇఒ మల్లికార్జునను వివరణ కోరగా నిధులు వస్తే తప్ప ఏమీ చేయలేని పరిస్థితి ఉందని సమాధానం దాటవేశారు.

## వీరభద్రస్వామి ఆలయ వార్షికోత్సవం

**రాయదుర్గం :** బ్రహ్మసముద్రం మండలంలోని ఏరడికేర గ్రామంలో వెలసిన వీరభద్రస్వామి ఆలయంలో సోమవారం నాల్గవ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు వీరభద్రస్వామి మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. బసవేశ్వరుని వేషధారుల ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. రాయదుర్గం మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, గుమ్మగట్ట జడ్పిటిసి మహేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

## నవ్యాంధ్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా హీరాలప్ప

**ప్రజాశక్తి-డి.హీరేహాల్**

అనంతపురం నగరంలోని ఉపాధ్యాయ భవన్‌లో సోమవారం నవ్యాంధ్ర ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా హీరాలప్పను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో మండల నవ్యాంధ్ర ఉపాధ్యాయుల సంఘం తరపున ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యాయ సంఘం నాయకులు హనుమంతప్ప, బడేరు బసవరాజు, అయ్యన, శ్రీనాథ్, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు

## ప్రజా సమస్యల పరిష్కారానికి 'మీ కోసం'

**ప్రజాశక్తి-బొమ్మనహాల్**

ప్రజా సమస్యల పరిష్కారానికి సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో 'మీ కోసం' కార్యక్రమం నిర్వహించి అర్జీలు స్వీకరించారు. అందులో ఎంఇఒ, తహశీల్దార్, ఈఒపిఆర్‌డి, వ్యవసాయ అధికారి, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ, పంచాయతీరాజ్ జెఇ, పశువైద్యాధికారి, విద్యుత్ శాఖ, పిహెచ్‌సి డాక్టర్, పోలీసులు హాజరయ్యారు. తహశీల్దార్ మాట్లాడుతూ మండలంలోని ప్రజల సమస్యలను పరిష్కరించడానికి నూతన ప్రభుత్వం 'మీ కోసం' కార్యక్రమం ప్రవేశపెట్టిందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.



మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

## విరివిగా మొక్కల పెంపకమే లక్ష్యం

◆డయేరియా నియంత్రణకు చర్యలు ◆కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్



విలేకరులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

జిల్లా వ్యాప్తంగా లక్ష్య మొక్కలు నాటి వాటిని సంరక్షించడమే లక్ష్యంగా అధికారులు ముందుకు సాగాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. అనంతపురం కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో సోమవారం నాడు వర్షపాతం వివరాలు, మొక్కల పెంపకం, డయేరియా నివారణ, హ్యాండ్ వాషింగ్, తదితర అంశాలపై పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జూన్ నెలలో సాధారణ వర్షపాతం 53.3 మిల్లీమీటర్లు కాగా, ఇప్పటివరకు 144.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదై 170.6 శాతం అదనంగా పడిందన్నారు. జిల్లాలో పచ్చదనం పెంచుకోవడం ద్వారా భూగర్భ జలం పెరుగుతుందన్నారు. జిల్లాలో 32 శాతం పచ్చదనం ఉండాల్సి ఉండగా, 7.50 శాతం మాత్రమే ఉందన్నారు. ఈ సంవత్సరం ఈ సీజన్లో జూన్, జూలైలోపు లక్ష మొక్కలు నాటాలని డ్రైవ్ చేపట్టామన్నారు. మొక్కల సంరక్షణకు సంబంధించి జూలై 1వ తేదీ నాటికి ఒక మొబైల్ యాప్ తయారు చేస్తామన్నారు. జియో లొకేటెడ్ డేటా అందులో వస్తుందని, ప్రతిరోజూ మొక్కలకు నీరుపోస్తున్న సెల్ఫీ అందులో అప్లోడ్ చేయాలన్నారు. మొక్కల పెంపకంపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు కల్పించాలని అధికారులకు సూచించారు. వర్షం ఎక్కువగా వచ్చినప్పుడు డయేరియా వచ్చే అవకాశం ఉందని, ఇలాంటి సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లాలో డయేరియాతో చిన్నారులు ఎవరూ చనిపోకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలంతా ఇంటి చుట్టూ ఉన్న చెత్తను తొలగించాలన్నారు. హ్యాండ్ వాషింగ్ టెక్నిక్‌పై డ్రైవ్ చేపడతామన్నారు. తాగునీటిని వేడి చేసి తాగాలన్నారు. అనంతం డయేరియా క్యాంపెయిన్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి, డిఆర్ఒ జి.రామకష్ణారెడ్డి, డిఎంహెచ్ఒ డా॥ఈబి.దేవి పాల్గొన్నారు.

## ఎవిఆర్ పాఠశాలలో పుస్తకాలు సీజ్

**ప్రజాశక్తి-రాయదుర్గం**



పుస్తకాలను చూపుతున్న ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ నాయకులు

పట్టణంలోని ఎవిఆర్ పాఠశాలలో పాఠ్యపుస్తకాలను అధిక ధరకు విక్రయిస్తుండగా విద్యార్థి సంఘాల ఫిర్యాదు మేరకు సోమవారం ఎంఇఒ-2 వెంకట రమేష్ పాఠశాలను సందర్శించి పుస్తకాలను సీజ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బంగి శివ, ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి అంజి, ఎన్ఎస్‌యుఐ తాలూకా అధ్యక్షులు అనిల్ కుమార్ ఫిర్యాదు మేరకు సోమవారం ఎంఇఒ-2 వెంకట రమేష్ ఎవిఆర్ పాఠశాలను తనిఖీ చేశారు. ప్రాథమిక పాఠశాల పుస్తకాలను అధిక ధరకు విద్యార్థులకు బలవంతంగా విక్రయిస్తున్నట్లు గుర్తించి పుస్తకాల నిల్వలను సీజ్ చేశారు. విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం పుస్తకాల ధరలు ఒక రకంగా ఉంటే పాఠశాల యాజమాన్యం అధిక ధరకు విద్యార్థులకు బలవంతంగా అంటగడుతోందని ఆరోపించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే పాఠ్యపుస్తకాలు విక్రయించాలని, అధిక ధరకు విక్రయిస్తే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు. తాలూకాలోని అన్ని ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హులు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు నాణ్యమైన విద్య అందిస్తారని, విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఉంటాయని కావున ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడులకే పంపాలని కోరారు. ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల ప్రలోభాలకు ఆకర్షితులు కావద్దని హితవు పలికారు.

## కౌలురైతులను ఆదుకోవాలి

**కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఎం.బాలరంగయ్య**

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

2019 సిసిఆర్‌సి చట్ట ప్రకారం జిల్లాలోని కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఎం.బాల రంగయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్‌లో కౌలు రైతుసంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎం.బాలరంగయ్య మాట్లాడు తూ సిసిఆర్‌సి చట్ట ప్రకారం గ్రామసభల ద్వారా కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డులు మంజూరు చేయడంతోపాటు పంట రుణాలు, పంట నష్టపరిహారం, పంటల బీమా వంటి పథకాలను అందజేసి ఆదుకోవాలని కోరారు. సిసిఆర్‌సి కార్డు అందాలంటే భూ యజమాని అనుమతి అవసరం ఉండటంతో వారు అనుమతి ఇవ్వకపోవడంతో సిసిఆర్‌సి కార్డులు అందకపోవడంతో నష్టపోతున్నారన్నారు. దీంతో పంటలు సాగు చేసి లాభాలు రాక అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాధారణంగా మిర్చి పంట ఎకరాలో సాగు చేయాలంటే కనీసం రూ.80 వేల నుంచి రూ.1.20లక్ష వరకూ పెట్టుబడి అవుతోందన్నారు. అంతపెట్టి సాగు చేసినా లాభాలు వస్తాయన్న నమ్మకం లేదన్నారు. పంట చేతికి రాకపోవడంతో రైతులు అప్పులపాలవుతున్నారన్నారు. కావున ప్రభుత్వ స్పందించి భూ యజమానికితో సంబంధం సీసీఆర్‌సి కార్డులను మంజూరు చేసి కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇకపోతే హెచ్చెల్సీ, జిబిసి కాలువలకు మరమ్మతులు చేపట్టి ఆయకట్టు చివరి వరకూ సాగునీరు అందించాలని కోరారు. అలాగే ఉరవకొండ నియోజకవర్గంలో మిర్చి, పప్పుశనగలాంటి పంటలకు గిట్టుబాటు ధర వచ్చేంత వరకూ శీతల గిడ్డంగులు ఏర్పాటు చేసి మార్కెట్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుసంఘం నాయకులు మనీలా రామాంజనేయులు, ఆది, చంద్రశేఖర్‌రెడ్డి, తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## 7న మాదిగల ఆత్మగౌరవ కవాతు

**ప్రజాశక్తి-రాయదుర్గం**

జులై 7వ తేదీ వరంగల్‌లో జరగనున్న మాదిగల ఆత్మగౌరవ కవాతును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు హరిగోపాల్ మాదిగ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎన్జీవో భవన్‌లో సోమవారం తాలూకా ఎమ్మార్పీఎస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. హరిగోపాల్ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ పిలుపుమేరకు 30వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా వరంగల్‌లో జరగనున్న ఆత్మ గౌరవ కవాతులో మాదిగలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెన్నప్ప, తాలూకా కార్యదర్శి తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## అనంత వైసిపి కార్యాలయానికి అహుడా నోటీసులు

**ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్**

అనంతపురం నగరంలోని హెచ్ఎల్‌సి కాలనీలో వైసిపి నిర్మించిన జిప్లస్ వన్ భవనాన్ని ఎందుకు కూల్చివేయరాదో ఏడు రోజుల్లోపు వివరణ ఇవ్వాలని అహుడా ప్లానింగ్ ఆఫీసర్ మహమ్మద్ ఇషాక్ వైసిపి జిల్లా అధ్యక్షుడికి నోటీసులు జారీ చేశారు. 13 సెంట్లకు పైబడిన స్థలంలో భవన నిర్మాణాలు చేపట్టాలంటే తప్పనిసరిగా అహుడా నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందని, అలాంటిది మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఒకటిన్నర ఎకరా స్థలంలో నిర్మిస్తున్న జిప్లస్ వన్ భవన నిర్మాణానికి ముందస్తు అనుమతులు తీసుకోలేదన్నారు. భవన నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. APMRUDA ACT, బైలాస్ ప్రకారం సెక్షన్లో. 84బి5, 88, 89బి1, 290,91 యాక్టు ప్రకారం అహుడా నుంచి అనుమతులు పొందకనే ఒకటిన్నర ఎకరా స్థలంలో భవన నిర్మాణం జరపటం చట్ట విరుద్ధమన్నారు. ఇందుకు సంబంధించి ఏడు రోజుల్లోగా వివరణ ఇవ్వని పక్షంలో కూల్చివేత ప్రక్రియ చేపడతామని అందులో తెలిపారు.

## డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాశక్తి-పెద్దపప్పూరు**

మండలవ్యాప్తంగా అధికారులు డయేరియాపై అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ కవిత సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎంపిడిఒ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు పైపులు లేకేజీలు లేకుండా చూడాలన్నారు. ప్రజలు కూడా కాంచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. ఆహార పదార్థాలపై ఈగలు వాలకుండా మూతలు ఉంచుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఈకార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు శర్మష్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

## పెట్టుబడిసాయం రైతుల ఖాతాల్లో జమచేయాలి

**ప్రజాశక్తి-కళ్యాణదుర్గం**



రాయదుర్గంలో తహశీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న సిపిఎం, ఎపి రైతు సంఘం నాయకులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పంట పెట్టుబడి సాయం రూ. 20 వేలను తక్షణమే రైతుల ఖాతాల్లో జమచేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సిపిఎం, ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అచ్యుత్ ప్రసాద్ మాట్లాడుతూ 2023 ఖరీఫ్, రబీలో తీవ్రమైన కరువు పరిస్థితులతో పంటలు సాగుచేసిన రైతులు పూర్తిగా నష్టపోయారన్నారు. ఆయకట్టు కింద సాగు చేసిన మిరప పంటకు చివర్లో నీరందక రైతులకు పెట్టుబడి కూడా దక్కలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2023 ఖరీఫ్‌లో 28 మండలాల ను, రబీలో 14 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించినా కరువు నివారణకు ప్రత్యేకంగా నిధులు కేటాయించలేదన్నారు. నూతన ప్రభుత్వమైనా పెట్టుబడి సాయంతో పాటు 2023 ఖరీఫ్, రబీ సీజన్లలో వంటలు నష్టపోయిన రైతులకు పంటల బీమా, కరువు నివారణకు ప్రత్యేక నిధులు ప్రకటించాలన్నారు. పెట్టుబడి సాయం కుటుంబం ఆధారంగా కాకుండా ఎకరాల ఆధారంగా ఎకరాకు కనీసం రూ. 10 వేలు చొప్పున పదెకరాల వరకూ ఇవ్వాలని కోరారు. డ్రిప్, స్ప్రింక్లర్లపై జిఎస్టీ రద్దు చేయడంతో పాటు దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకు 90 శాతం సబ్సిడీతో ఇవ్వాలన్నారు. జిల్లాలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, పెండింగ్‌లో వున్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగునీరివ్వాలని, వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించే జిఒ నెం. 22ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వినతి ఇచ్చిన వారిలో సిపిఎం మండల కార్యదర్శి రంగనాథ్, పట్టణ కార్యదర్శి రఘు, మంజు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ, భవిత్, తదితరులు పాల్గొన్నారు.

**రైతుసంఘం ఆధ్వర్యంలో వినతి**

**రాయదుర్గం :** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడి సాయం రూ. 20 వేలను తక్షణమే రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని ఎపి రైతు సంఘం, సిపిఎం నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రైతు సంఘం తాలూకా అధ్యక్షులు పి.జయరాం నాయక్, సిపిఎం నాయకులు నాగరాజు, రమేష్ సోమవారం ఫిర్యాదుల దినోత్సవం సందర్భంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ చిట్టి బాబుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పెట్టుబడి సాయంతో పాటు గతేడాది ఖరీఫ్, రబీ సీజన్లలో వంటలు నష్టపోయిన రైతులకు పంటల బీమా, కరువు నివారణకు ప్రత్యేక నిధులు ప్రకటించాలని డిమాండ్ చేశారు.

# చాగల్లులో దూకి వదిన, మరిది ఆత్మహత్య

## రెండు రోజుల క్రితం ఇద్దరూ అదృశ్యం



మృతిచెందిన వదినా, మరిది

**ప్రజాశక్తి-పెద్దపప్పూరు**

రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయిన వదినా, మరిది పెద్దపప్పూరు మండల పరిధిలోని చాగల్లు రిజర్వాయర్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. వివాహేతర సంబంధం నేపథ్యంలో ఈ ఇద్దరూ ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇందుకు సంబంధించి పెద్దపప్పూరు ఎస్‌ఐ గౌస్ బాషా తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... గుత్తి మండలం బేతాపల్లి గ్రామానికి చెందిన జిలాన్, నిజామీ(35) భార్యాభర్తలు. ఉమ్మడి కుటుంబం కావడంతో జిలాన్ తమ్ముడు మహ్మద్‌బాషా(25) కూడా వారి ఇంట్లోనే ఉండేవాడు. కుటుంబ జీవనం రిత్యా కొన్నేళ్ల క్రితం వీరు తాడిపత్రికి మకాం మార్చారు. జిలాన్ ఆటోడ్రైవర్‌గా, మహ్మద్‌బాషా కార్పెంటర్‌గా పనిచేస్తుండేవారు. గత కొంతకాలంగా మహ్మద్ బాషా తన వదిన మధ్య వివాహేతర సంబంధం కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఇదే విషయంపై జిలాన్ తన తమ్ముడు మహ్మద్‌బాషా, భార్య నిజామీలను మందలించాడు. అయినా వారి పద్ధతిలో మార్పు రాలేదు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం మహ్మద్‌బాషా, నిజామీ ఇద్దరూ ఇంటి నుంచి వెళ్లిపోయారు. దీనిపై జిలాన్ ఆదివారం నాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం చాగల్లు రిజర్వాయర్ వద్ద స్థానికులకు ఓ ద్విచక్రవాహహనం కనపడింది. రిజర్వాయర్ నీటిలో చూడగా మహిళ మృతదేహం కన్పించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి మహిళ మృతదేహాన్ని బయటకు తీశారు. ద్విచక్రవాహనంలో ఉన్న సెల్‌ఫోన్ల ఆధారంగా మృతురాలు నిజామీగా గుర్తించారు. కన్పించకుండా పోయిన మహమ్మద్‌బాషా కోసం గాలించగా సాయంత్రం అతని మృతదేహం కూడా రిజర్వాయర్‌లో లభించింది. అక్రమ సంబంధం నేపథ్యంలో ఇద్దరూ ఆదివారం నాడు రిజర్వాయర్‌లో దూకి ఆత్మహత్య చేసుకుని ఉంటారని పోలీసులు నిర్ధారించారు. ఈ మేరకు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి పోలీసు స్టేషన్‌కు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపప్పూరు ఎస్‌ఐ తెలిపారు.

# రైతులకు రూ.20వేలు ఆర్థికసాయం అందజేయాలి

## రైతుసంఘం ఆధ్వర్యంలో వినతులు




తాడిపత్రిలో ధర్నా చేస్తున్న ఎపి రైతుసంఘం నాయకులు

**ప్రజాశక్తి-శింగనమల**

టిడిపి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రైతులకు రూ.20వేలు ఖాతాల్లోకి జమ చేసి ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు భాస్కర్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావేదికలో తహశీల్దార్ శోభన్‌బాబు, వ్యవసాయ అధికారి అన్వేష్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 ఖరీఫ్, రబీ సీజన్‌లలో తీవ్రంగా నష్టపోయిన రైతాంగం ప్రస్తుతం సాగు చేయలేని దుస్థితిలో ఉందన్నారు. ఆఖరికి ఆయకట్టు కింద సాగు చేసిన పంటలు సైతం చివరలో నీరు అందక తీవ్రంగా నష్టపోయారన్నారు. ఆఖరికి పెట్టుబడులు కూడా రాకపోవడంతో అప్పులు ఊబిలో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరువు మండలాలను ప్రకటించినా నివారణ చర్యలు చేపట్టకపోవడం బాధాకరమన్నారు. ఈ సమయంలో టిడిపి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రూ.20వేలు పెట్టుబడి సాయం రైతుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. అలాగే డ్రిప్పు, స్ప్రింక్లర్లపై జీఎస్టీ రద్దు చేసి దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకూ 90శాతం సబ్సిడీతో ఇవ్వాలని, జిల్లాల వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని, వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు పుల్లన్న, రుషింగప్ప, మునెప్ప, ఓబులేసు, శ్యాంకుమార్, తదితరులు పాల్గొన్నారు.

**పుట్లూరు :** ప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడి సాయం రూ.20వేలు వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో తహశీల్దార్ మల్లికార్జునస్వామి, ఎఒ కాత్యాయనికి రైతుసంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2023 ఖరీఫ్, రబీ పంటల బీమా ప్రకటించాలని, కరువు నివారణకు ప్రత్యేక నిధులు కేటాయించాలని, పెట్టుబడి సాయం పదెకరాల వరకూ ఇవ్వాలని, డ్రిప్పు, స్ప్రింక్లర్లపై జీఎస్టీని రద్దు చేసి దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకూ 90 శాతం సబ్సిడీతో ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి జి.వెంకటచౌదరి, వ్య.కా.సం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, జిల్లా అధ్యక్షులు సూరి, రైతుసంఘం నాయకులు భాస్కర్‌రెడ్డి, నాగేంద్ర, పెద్దయ్య, నాగభూషణం, కుళ్లాయప్ప, రఘువీరా, రాజకొల్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

**పామిడి :** ప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడి సాయం రూ.20వేలు వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని ఎపి రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ చంద్రశేఖర్‌నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతుసంఘం మండల కార్యదర్శి ముత్యాలు, సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్ మాట్లాడుతూ తీవ్ర కరువు కోరల్లో చిక్కుకున్న రైతాంగానికి ప్రభుత్వం పెట్టుబడి సాయం అందజేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాబా ఫక్రుద్దీన్, ఈశ్వరయ్య, రామదాసు, తదితరులు పాల్గొన్నారు.

**గుత్తి :** ప్రభుత్వం రైతులకు ప్రకటించిన రూ.20వేలు పెట్టుబడి సాయం తక్షణమే ఖాతాల్లో జమ చేయాలని ఎపి రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహశీల్దార్ బి.భారతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం నాయకులు వి.నిర్మల, యు.మల్లికార్జున మాట్లాడుతూ 2023 ఖరీఫ్, రబీ సీజన్లలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. వారందరూ తిరిగి పంటలు సాగు చేయాలంటే ప్రభుత్వం తప్పనిసరిగా పెట్టుబడి సాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు ఎం.మల్లేష్, ఎం.చిన్నమారెన్న పాల్గొన్నారు.

**ఉరవకొండ :** ప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడి సాయం రూ.20వేలు రైతుల ఖాతాల్లోకి జమ చేయాలని సిపిఎం ఉరవకొండ మండల కన్వీనర్ మధుసూదన్, కాంగ్రెస్ నాయకులు ఇంద్రావతి ఓబులేసు, సోనియా సీన డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల వేదికలో డిప్యూటీ తహశీల్దార్ మునీంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు విజయ్, హనుమంతు, వన్నూరుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

**తాడిపత్రి రూరల్ :** ప్రభుత్వం ప్రకటించిన వ్యవసాయ పెట్టుబడి సాయం రూ.20 వేలు రైతుల ఖాతాల్లో జమచేయాలని ఎపి రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమస్యల పరిష్కార వేదికలో తహశీల్దార్ ఆంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతుసంఘం మండల కార్యదర్శి రాజారామిరెడ్డి, రెడ్డి రమేష్, చిన్న పొలమడ నారాయణరెడ్డి, ఆవుల తిప్పయ్యపల్లి జయశంకర్‌రెడ్డి, ఎగురుపల్లి చెన్నారెడ్డి, పెద్దపొలమడ వెంకటేశు, తెరన్నపల్లె గోపాల్‌నాయుడు, వెంకట్‌రెడ్డిపల్లి భూపాల్, వెంకటంపల్లి రమేష్, రైతులు పాల్గొన్నారు.

**పెద్దవడుగూరు :** ప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడి సాయం రూ.20వేలు రైతుల ఖాతాల్లోకి జమ చేయాలని ఎపి రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి దస్తగిరి, నాయకులు కుళ్లాయప్ప, రామాంజనేయులు, రాజా, పెద్దన్న, వీరన్న, పల్లి ఓబులేసు, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాశక్తి వార్తకు స్పందన

# సంత బజారులో గుంతలు పూడ్చివేత



గుంతలను పూడుస్తున్న పంచాయతీ సిబ్బంది

**ప్రజాశక్తి-నార్పల**

మండల కేంద్రంలోని సంతబజారులో సిమెంటు రోడ్డుపై ఏర్పడిన గుంతలను ఎట్టకేటలకూ పంచాయతీ సిబ్బంది పూడ్చివేశారు. సంతబజారులు సిమెంటు రోడ్డు గుంతలమయమై ప్రజలు పడుతున్న ఇబ్బందులపై ప్రజాశక్తి దినపత్రికలో 'గుంతలు పూడ్చరూ' అంటూ సోమవారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన మేజర్ పంచాయతీ కార్యదర్శి అశ్వర్థ నాయుడు సోమవారం ఉదయమే సిబ్బందితో చేరుకుని సంత బజారు రోడ్డులోని గుంతలను ఎర్రమట్టితో పూడ్చివేశారు. దీంతోపాటు గుంతల కింద పంచాయతీ కొళాయి పైపులు లీకవుతుంటే పరిశీలించి సమస్య తిరిగి పునరావృతం కాకుండా నూతన పైపులు వేయిస్తామని తెలిపారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ప్రజాశక్తికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# భద్రతా ప్రమాణాలు పాటించాలి

## దక్షిణ మధ్య రైల్వే జిఎం అరుణ్‌కుమార్‌జైన్



మాట్లాడుతున్న దక్షిణ మధ్య రైల్లే జిఎం అరుణ్‌కుమార్‌జైన్

**ప్రజాశక్తి-అనంతపురం**

రైళ్లను సురక్షితంగా నడపడానికి తప్పనిసరిగా భద్రతా ప్రమాణాలను పాటించాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ సంబంధిత అధికారులు ఆదేశించారు. సోమవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, నాందేడ్ డివిజినల్ రైల్వే మేనేజర్ల (డిఆర్‌ఏంలు)తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైలు కార్యకలాపాల్లో పాల్గొనే భద్రతకు సంబంధించిన లోకో పైలట్లు, అసిస్టెంట్ లోకో పైలట్లు, పాయింట్ మెన్, స్టేషన్ మాస్టర్లు, ఇతర సిబ్బందికి ఆచరణాత్మకంగా కౌన్సెలింగ్ సెషన్లను ఏర్పాటు చేయాలని సూచించారు. రైళ్ల రాకపోకలకు ఇబ్బంది లేకుండా అసాధారణ ఘటనలు జరగకుండా ఉత్తమ విధానాలను అమలు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు జనరల్ మేనేజర్ ఆర్.ధనంజయులు, తదితరులు పాల్గొన్నారు.

# 7 నుంచి గూగూడు కుళ్లాయిస్వామి ఉత్సవాలు



గూగూడులో వెలసిన కుళ్లాయిస్వామి, ఆంజనేయస్వామి ఆలయాలు

**ప్రజాశక్తి-నార్పల**

మండల పరిధిలోని గూగూడులో వెలసిన కుళ్లాయిస్వామి బ్రహోత్సవాలు జూలై 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు కార్యనిర్వహణాధికారి సాకేతపురం శోభ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దాదాపు 13 రోజులపాటు ఉత్సవాలు జరగనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 7న స్వామివారి ప్రథమ దర్శనం, 9న అగ్నిగుండం ఏర్పాటు, 10న స్వామివారిని నిలుపుట, 12న ఐదవ సరిగెత్తు, 14న చిన్న సరిగెత్తు, 16న పెద్ద సరిగెత్తు, 17న అగ్నిగుండం ప్రవేశం, 19న స్వామి చివరి దర్శనంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

# విద్యావ్యవస్థను మెరుగుపరచాలని వినతి

**ప్రజాశక్తి-అనంతపురం**

రాష్ట్రంలో విద్యావ్యవస్థను ప్రథమస్థాయికి తీసుకెళ్లే దిశగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అడుగులు వేయాలని టిడిపి క్రిస్టియన్ రాష్ట్ర అధ్యక్షులు స్వామిదాస్, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు పోతుల లక్ష్మీనరసింహులు కోరారు. ఈమేరకు నారా లోకేష్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నారా లోకేష్ విద్యాశాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే గ్రౌండ్ రియాలిటీ తెలుసుకునేందుకు విద్యార్థి సంఘాలతో మొదటి సమీక్ష నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. వైసిపి పాలనలో విద్యావ్యవస్థను భ్రష్టు పట్టించారన్నారు. విద్యార్థులకు అందించే చిక్కిల నుంచి బ్యాగుల వరకూ అన్నిస్కాములే అని విమర్శించారు. అంతేగాకుండా కళాశాలలు, యూనివర్సిటీలు గంజాయికి నిలయాలుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. గాడి తప్పిన విద్యా వ్యవస్థను గాడిలో పెట్టి విద్యారంగాన్ని సమర్థవంతంగా నాణ్యతా ప్రమాణాలు పెంచి దేశంలోని రాష్ట్ర విద్యాశాఖను అగ్రగామిగా నిలబెట్టాలని కోరారు.

# మాజీ సిఎం జగన్‌పై చర్యలు తీసుకోవాలి

**అనంతపురం :** ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమిని అక్రమంగా కారుచౌకగా లీజుకు తీసుకుని పార్టీ భవనాలు నిర్మిస్తున్న మాజీ సిఎం, వైసిపి అధినేత జగన్‌పై చర్యలు తీసుకోవాలని టిడిపి మహిళా నాయకురాళ్లు డిమాండ్ చేశారు. అక్రమంగా వైసిపి కార్యాలయాలను నిర్మిస్తున్నందుకు నిరసనగా సోమవారం జిల్లాకేంద్రంలోని నిర్మాణంలో ఉన్న వైసిపి జిల్లా కార్యాలయంలో సిఎం జగన్ చిత్రపటానికి చెప్పుల దండ వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి మహిళలు మాట్లాడుతూ అనంతపురంలో ఎలాంటి అనుమతులు లేకుండా కారుచౌకగా ఎకరాకు రూ.వెయ్యి చొప్పున 33 ఏళ్లు రాయించుకుని ప్రజల సొమ్మును దుర్వినియోగం చేయడం బాధాకరమన్నారు. సొంత వైసిపి కార్యాలయాల కోసం అధునాతన ప్యాలెస్‌లు నిర్మించుకున్న జగన్‌పై వెంటనే ఉన్నతాధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# అంగన్వాడీ, ఆశాల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం కార్మికులు, విఒఎల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.నాగమణి, ఎస్.నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉరవకొండ మండలం ముష్టూరులో అంగన్వాడీ సెంటర్‌ను తెరవకుండా కొందరు స్థానికులు అంగన్వాడీ వర్కర్లను అడ్డుకుంటున్నారన్నారు. విడపనకల్ మండలం జనార్ధనపల్లి హెల్పర్‌ను ఇలాగే రాజీనామా చేయాలని వేధిస్తున్నారని వివరించారు. అలాగే ఆశావర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులను కూడా రాజీనామా చేయాలని నేతలు బెదిరిస్తున్నారని తెలిపారు. కావున ఉన్నతాధికారులు స్పందించి ఇలాంటి ఆకృత్యాలను అరికట్టాలని, లేనిపక్షంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు, వెంకటనారాయణ పాల్గొన్నారు.

# మూసివేసిన దారులను తెరవాలని సిపిఎం వినతి



ఎడిఆర్‌ఎంకు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

**ప్రజాశక్తి-గుంతకల్లు**

పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలోని పలు ప్రాంతాల్లో మూసివేసిన దారులను వెంటనే తెరవాలని సిపిఎం నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం స్థానిక కార్యాలయంలో రైల్వే ఎడిఆర్‌ఎం సుధాకర్‌ను సిపిఎం నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు డి.శ్రీనివాసులు మాట్లాడుతూ రైల్వే అధికారులు రైల్వే ప్రాంతంలోకి ప్రవేశం లేకుండా కొన్నిదారులను మూసివేశారన్నారు. దీంతో రైల్వేస్టేషన్, రైల్వే ఆసుపత్రికి వచ్చేవారితోపాటు రైల్వే ఉద్యోగులు, చందమామ, చర్చి, రైల్వే హైస్కూల్, సెంట్రల్ స్కూల్, బెంచి కొట్టాల, మస్తాన్‌పేట, భాగ్యనగర్, ప్రశాంతినగర్‌లోని పలు కాలనీ ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున రోడ్డుకు అడ్డంగా కట్టిన గోడలను తొలగించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు దాసరి శ్రీనివాసులు, మారుతీప్రసాద్, జగ్గలి రమేష్, కసాపురం రమేష్, సాకే నాగరాజు, పట్టణ కమిటీ సభ్యులు చంద్ర, ఓబులేష్, తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.

# నారాయణ విద్యాసంస్థలను సీజ్ చేయాలి

## ఐక్యవిద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన



వినతిపత్రం సమర్పిస్తున్న ఐక్య విద్యార్థి సంఘం నాయకులు

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

జిల్లావ్యాప్తంగా నారాయణ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టి విద్యాసంస్థలను సీజ్ చేయాలని ఐక్యవిద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని నారాయణ జూనియర్ కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు ఓబులేష్, ఏఐఎస్‌బి జిల్లా ప్రధాన కార్యదర్శి పృథ్వీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థి సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్‌యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ నారాయణ విద్యాసంస్థల పేరుతో ముద్రించిన పుస్తకాలను రూ.10 నుంచి రూ.15వేల వరకూ అమ్ముతున్నారని ఆరోపించారు. దీనిపై అనేకమార్లు ఆధారాలతో సహా ఆర్ఐఓకు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. నారాయణ విద్యాసంస్థలకు వత్తాసుగా పని చేస్తున్న ఆర్ఐఒను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సిద్ధు, గిరి, సూర్య, శివప్రకాష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రమణయ్య, నాయకులు మంజునాథ్, వంశీ, ఆనంద్, పవన్, హర్ష, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి సవితకు సన్మానం



మంత్రికి బొకేలు అందజేస్తున్న బిసి, ఓబిసి సంక్షేమ సంఘం నాయకులు

**అనంతపురం :** రాష్ట్ర బిసి, ఓబిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పిడుగు శ్రీనివాసులు ఆధ్వర్యంలో రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవితమ్మను సోమవారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. వెనుకబడిన ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి నూతనంగా ఏర్పడిన ప్రభుత్వంలో బిసి సంక్షేమ శాఖ మంత్రిగా సవితమ్మ పదవీ బాధ్యతలు అప్పగించినందుకు సిఎం చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో సభ్యులు టీచర్లు బొల్లు బాల సుబ్రమణ్యం, బీరప్ప, జిల్లా పరిషత్ సీనియర్ అసిస్టెంట్ బాలగొండ మహేష్, అడల్ట్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ లక్ష్మీనారాయణ, అటవీశాఖ శివ, తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి కార్యకర్త మృతికి నివాళి

**పుట్లూరు :** మండలంలోని ఎల్లుట్ల గ్రామంలో ఆత్మహత్య చేసుకున్న టిడిపి కార్యకర్త రామాంజినేయులు మృతికి ఆ పార్టీ నాయకులు సోమవారం నివాళులర్పించారు. రామాంజనేయులు ఆత్మహత్య చేసుకున్న విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు ఆసుపత్రికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నివాళులర్పించిన వారిలో టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన్ నాయుడు, ఐ టిడిపి రాష్ట్ర కార్యదర్శి విజయ్‌కుమార్ నాయుడు, నాయకులు రవిచంద్రనాయుడు, శివశంకర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, లక్ష్మయ్య, శ్రీనివాసులురెడ్డి, రంగప్ప, రామయ్య, సత్యమయ్య, తీర్థమయ్య, తదితరులు ఉన్నారు.

# సాంకేతిక పరిజ్ఞానంతో ఉద్యోగావకాశాలు

**గుత్తి :** ఏఐ, మిషన్ లెర్నింగ్, ఐఓటి సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవడం ద్వారా విద్యార్థులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ గజ్జల రఘునాథరెడ్డి సూచించారు. సోమవారం స్థానిక గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ బిఎస్ఎన్ఎల్ సంస్థతో గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు ఎంఓయు ఒప్పందం కుదిరిందన్నారు. ఒప్పంద ప్రకారం ఈసీఈ, సీఎస్ఈ, ఆర్టిఫిషియల్ (ఏఐ), ఈఈఈ విద్యార్థులకు టెక్నాలజీతో పని చేసే వెసులుబాటు కలుగుతుందన్నారు. బిఎస్ఎన్ఎల్ సంస్థ జనరల్ మేనేజర్ ముజీబ్ షాషా మాట్లాడుతూ బిఎస్ఎన్ఎల్ శిక్షణ కేంద్రం ద్వారా విద్యార్థులకు ఎల్‌టీఈ, 4జీ, 5జీ టెక్నాలజీలపై శిక్షణ ఇవ్వవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఎన్ఎల్ సంస్థ ప్రతినిధులు బాలగంగాధర్‌రెడ్డి, బాలాజీ, బాబా ఫక్రుద్దీన్, గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వీకే. పద్మావతమ్మ, డైరెక్టర్ శ్రీవాణి, ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ప్రవీణ్, ఏఓ ఇంతియాజ్, ప్లేస్‌మెంట్ అధికారి తన్వీర్ పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాన్ని చూపుతున్న గేట్స్ ప్రతినిధులు

# తెలుగు తమ్ముళ్ల సంబరాలు

**అనంతపురం :** అనంతపురం పార్లమెంటు సభ్యుడిగా అంబికా లక్ష్మీనారాయణ సోమవారం ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా సోమవారం నగరంలోని తెలుగు తమ్ముళ్లు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఇందులో భాగంగా అంబికా చిత్రపటం ముందు కేక్ కోసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కాయల ఆదినారాయణ, టి.ఆదినారాయణ, పి.ఓంకార్‌రెడ్డి, కృష్ణం రఘు, బళ్లారి గోపాల్, పూజారి నాగన్న, ముచ్చుకోట శివయ్య, అరవకూరు నరసింహులు, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

# పిహెచ్‌డి ప్రవేశాలకు ఇంటర్వ్యూలు

**అనంతపురం :** పరిశోధక విద్యలో ప్రవేశాలు కోసం నిర్వహించిన ఏపీఆర్‌సి సెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు రీసెర్చ్, డెవలప్‌మెంట్ డైరెక్టర్ అధ్వర్యంలో సోమవారం స్థానిక జెఎన్‌టియు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలను జెఎన్‌టియు విసి జివిఆర్.శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్‌వి.సత్యనారాయణ, హెచ్.సుదర్శన్‌రావు, పిఆర్.భానుమూర్తి, సి.శోభాబిందు, వైస్ ప్రిన్సిపాల్ ఇ.అరుణకాంతి, పి.చెన్నారెడ్డి, ఎస్.వసుంధర, ఎపి.శివకుమార్, టి.బాలనరసయ్య, బి.దిలీపకుమార్, కెఎఫ్.భారతి, తదితరులు పాల్గొన్నారు.

# కల్తీ మందులు విక్రయిస్తే దుకాణాలు సీజ్

**బుక్కరాయసముద్రం :** కల్తీ మందులు విక్రయిస్తే దుకాణాలను సీజ్ చేస్తామని విజిలెన్స్ అధికారి ఫణీంద్రనాథ్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం మండలంలోని రెడ్డిపల్లిలో ఉన్న ప్రసన్న ఆంజనేయ ఫర్టిలైజర్స్, బాలాజీ ఎరువుల దుకాణాలను స్థానిక వ్యవసాయధికారి వాసుప్రకాష్‌తో కలిసి తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పలు రికార్డులు, లైసెన్స్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా రూ.2,23,400 విలువజేసే ఎరువులు, పురుగు మందుల అమ్మకాలు నిలుపుదల చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయధికారి శ్యాంసుందర్‌రెడ్డి, విజిలెన్స్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని వినతి

**పెద్దవడుగూరు :** మండలంలోని కొండూరు సమీపంలో ఉన్న పెన్నానది పరివాహక ప్రాంతం నుంచి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని ఎస్ఐ శ్రీనివాసులుకు స్థానికులు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఆదివారం రాత్రి ట్రిప్పర్లతో ఇసుకను తరలిస్తూండగా సమాచారం ఇవ్వడంతో పోలీసులు వచ్చి ఏడు ఇసుక ట్రిప్పర్లు, ఓ ఇటాచి యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నారన్నారు. ఇప్పటి నుంచి ఇసుక తరలించకుండా చూసి నీటి నిల్వలను కాపాడాలని కోరారు.

# 73,933 క్వింటాళ్ల వేరుశనగ పంపిణీ

**అనంతపురం :** జిల్లావ్యాప్తంగా సోమవారం నాటికి 82,125 మంది రైతులకు 73,993 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కాయలు పంపిణీ చేసినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి యు.ఉమామహేశ్వరమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. నెలాఖరు వరకూ విత్తన పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. 50 శాతం రాయితీతో జనుము, జీలుగ, పిల్లిపెసర లాంటి పచ్చిరొట్ట, రాగులు, కొర్రలు, 30 శాతం రాయితీతో కందులు, మినుములు, పెసర విత్తన పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

# ఇళ్లపట్టాలివ్వాలని వినతి

**పామిడి :** పట్టణంలోని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అఖిల భారత రైతు కూలీసంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ చంద్రశేఖర్ నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అఖిల భారత రైతుకూలీ సంఘం మండల కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ కొండాపురం రోడ్డులో సర్వేనెంబర్-1లో మూడేళ్ల నుంచి పేదలు గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారన్నారు. వారందరికీ వెంటనే పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రంగనాయకులు, నాగేంద్ర, ప్రసాద్, సర్వేస్, సుంకన్న, ఓబులేసు, నాగమ్మ, సునీత, తిరుపాలు, పెద్దన్న, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేలను కలిసిన 'ఆలం'



ఎమ్మెల్యేకు బొకే అందజేస్తున్న టిడిపి నాయకులు

**నార్పల :** విజయవాడలో జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల సందర్భంగా జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు పరిటాల సునీత, బండారు శ్రావణిశ్రీని మండల డిజి నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేలను కలిసిన వారిలో టిడిపి జిల్లా నాయకులు ఆలం వెంకట నరసానాయుడు, తదితరులు ఉన్నారు.

# గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి

**గుత్తి :** మండల పరిధిలోని కె.ఊబిచెర్ల ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు వై.నరసింహులు (52) ఆదివారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతిచెందాడు. అనంతపురంలోని స్వగృహంలో ఉన్న ఫలంగా ఛాతీలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం కలచాట్ల గ్రామానికి చెందిన నరసింహులు 2002లో డీఎస్సీ ద్వారా ద్వితీయ శ్రేణి ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. మతుడికి భార్య రంగమ్మ, కుమారుడు చక్రవర్తి, కుమార్తె ప్రియాంక ఉన్నారు. కాగా ఉపాధ్యాయుడు మృతికి ఎపిటిఎఫ్ నాయకులు దేశాయి నాగరాజు, రామచంద్రుడు, ఆదినారాయణరెడ్డి, శ్రీనివాసులు, లక్ష్మణ్, మహమ్మద్ బాషా నివాళులర్పించారు.